# 3

# శాఖాపంతులుగారు

ఉన్నదున్నట్టు, జరిగింది జరిగినట్టు, వ్రాదామని సంకల్పించుకున్నానీతడవ. ఎంచేతా అంటే—కల్పించుకొంటూ ఎన్ని వ్రాసినా ముక్తి మోక్షం లేదనిపించడం వల్లను, మరీన్నీ చదువరులూరకే ఆ అబద్ధపు కల్పనాలు చదివి "నిజంగా జరిగిందేనా అండీ" అని అడిగితే "లేదోయి అబద్ధమే నిబద్ధిగా కనబడేటట్టు వ్రాసేనోయి" అని బుకాయించవలసి వస్తూండడంవల్లను, ఇంతకూ ఒక్క సత్యము తులసిసీ దూచిన అన్న పద్యములో చెప్పినట్లు ఒక్కసత్యముతో సరైంది, నైతికశాస్త్రమందేమి ధర్మచర్చలందేమి, వేదాంత గోష్ఠియందేమి, లేదని చాటడం వల్లను - ఇన్నివిధాలుగా మనసు కుదుట పరచుకొని నేటికున్నదున్నట్టు జరిగింది జరిగినట్లు వ్రాదామని సంకల్పించు కున్నాను.

అయితే ఆమార్గ మనుకొన్నంత సుళువు కాదనిపిస్తోంది. బ్రతికున్న వాళ్ళనుగూర్చి యున్నదున్నట్లుగా వ్రాస్తిమా— వాళ్లకు కులుకుం సెడి యులుకు రావడమే కాకుండా వ్రాయసగాని మీద పరువు నష్టపువ్యాజ్యాలు బనాయిస్తారు. అంచేత ఇప్పట్కీ రచనలల్లో మృతులైనవాళ్ళను గురించే రచించాలి.

మహాత్ములైన వారు పెళ్ళి కాని వారై యుండాలి, పిల్లలు లేని వారై యుండాలి; లేకపోతే వాళ్లకీ స్త్రీ శేషులుగా, గీర్తించక వ్రాస్తే యా పెండ్లాంబిడ్డలు కలవరిస్తారు. మెటికలు విరుస్తారు. అతగాడా స్త్రీ లేని వాడై యుండాలి. కాకుంటే చదువరులా స్త్రీ యెక్కడుంది? వానికా స్త్రీ యందెట్టి హక్కుంది? ఎవళ్లూ లేకపోతే అదెవరికి సంక్రమిస్తుంది? వ్రాసేవారికా! చదివేవారికా? లేకుంటే సర్వం సహా యిస్తాయా అంటూ నిర్మాణమైన ప్రభుత్వం వానికా? అనే దురూహల్లోకి దిగుతారు. మఱి బొద్దూ పొడుగూ అందం చందాలేని వాడవాలి అలా కాకపోతే వాని యొక్క సూక్ష్మదేహాన్ని గురించి యోజిస్తూ, అంత్యవిరహంలో అంతటివారూ పడుచు అప్సరసలు, గంధర్వులు, కిన్నెరసానులు, నాగాంగనలు, నరాంగనలు, అంతా వొక్కమాటుగా జుట్టిలోబడి, గోల్లుమంటారు. అంచేత ఎన్నో మినహాయింపులు చూచుకొని పవిత్రం కాకుండా, ఉన్నదున్నట్టు జరిగింది జరిగినట్టు వ్రాయడమనేదుండే అది బహుప్రయాస.

అందుకే అందరూ ఇట్టిట్టే తమమోహ మోరాసక్రీడ ఘట్టంగుండా వెలిబుచ్చుకొని, తమశోక మోహ సీతమ్మవారి వనవాస గాథలాగ రోదించుకొని, తమ విరాగమోహక మహర్షియమాయక రూపంద్వారా ద్విగుణీకృతం చేసికొని, అసలు సంగతి తేలక అన్నివిధాల అన్వయకాఠిన్యాలకు అర్థాంతరన్యాసాలకు రాద్ధాంత సిద్ధాంతాలకు ఎడమిచ్చేరు. ఆపంథకు అడ్డుతగిలేవా

ల్లేవరూ ఉండరు. చిత్తం వచ్చినట్టుగా చిక్కం అల్లినట్టు అల్లెయ్యా వచ్చును.

అందుచేత నాయీ ప్రస్తుతభారం, సత్యంమీద ఆధార పడ్డది అయినప్పటికిన్నీ, తత్వంమీదంతా చదివే వాటంత సుల భంగా రచింప బడ్డది కాదు.

అహా! జ్ఞాపకం తెచ్చుకోగా తెచ్చుకోగా కనిపించేడో మానవుడు. —* శాఖాపంతులుగారు. పొడ్డికాళ్ళు! మొగ మీ్మదో కంతి! – పెళ్ళిలేదు. పెంకుల్లేవు! బెత్తెడుభూమి లేదు- బతికినన్నాళ్ళూ కత్తిరికోంపే.

అయితే వారింటిపేరు శాకావారా శాఖావారా? అనే వితర్కింపు పోలేను. ఉన్నదున్నట్టుగా వ్రాస్తూ వున్నానుగానీ. శాకావారనీ తోస్తుంది శాఖావారనీ తోస్తుంది. శాకావారని యనుకోవడానికి కారణం ఆయన శాకపాకాదుల విషయంలో మిక్కిలి నిక్కచ్చిమనిషి. పనసకాయ సంపాదించినాడా అంటే పీటచెక్కమీద నిలుచుండబెట్టి, దానిచెక్కులు చెక్కడం కాణించి, పొట్టుకింద చితక్కొట్టి, ఆవపెట్టి, కరివేపాకువేసి పోపులో నూని చాల్నంతోసి, రుచిచూసి, మహాబాగావుంది అని అనుకొని తినేసేదాకా మరి వీధిలోకి రాడు. అందు కోసంగా అమేషా ఓ కత్తి ఓ పసుపుడబ్బా, ఓ బంకగికే అట్ల కాడ, ఓ నూనిసిద్ది అన్నీ ఓమూల అమారుగా వుండేవి

నిత్తైమూ. మరి అందునుగురించి అతని ఊహా స్వాతంత్ర్యం ఎంతవఱకూ కొమ్మలు మెలితిరిగి పోయిందంటే—ఓనాడొకరు "అయ్యా! కొన్నాళ్ళు చంద్రుడు కనబడక, అన్నీ చుక్కలే కనబడతాయి! యేమిటండీ దాని సాంకేతికం?" అని అడిగినారట. అడిగితే యీాయన జవాబు చెప్పేట్ట— శచీదేవి యింద్రుని నిమిత్తార్థమై పచనం కోసంగాను ఇంద్రుణ్ణి కూరా?" అంటే చంద్రుడనే పనసకాయ దెచ్చి అందులో ఉన్న నలుపు ముచిగ్గా పైకెగలాగి పట్టి తన వజ్రాయుధంతో చకాచకా పొట్టుగా కొట్టి పెళ్ళాం కిచ్చేట్ట. ఆ కొట్టినప్పుడు చెల్లా చెదురై విరజిమ్మకు పోయిన కొంతపొట్టే యీా కనవచ్చే చుక్కలూ" అన్నాట్ట. దానిమీాద సందేహ నివృత్తి కానివాళ్ళు "పనసకాయ నలుపా తెలుపా, చంద్రుణ్ణి పనసకాయ అనుకోవడం ఎట్లా తటస్థించిందీ?" అంటే "ఐరావతం ఆదిశేషువు తెలుపు. ఇంద్రజాల శాస్త్రంలో అన్నీ తెలుపే" అని "ఇంతకూ పనసకాయ తెచ్చి మాట్లాడుతున్నావా? తేకుండా మాట్లాడుతున్నావా? తేకపోతే వెళ్ళిపో. నా ముందుండకు; నన్నేమీా అడక్కు; వేదంలో చూచుకో ఆ పేరు కనిపిస్తుంది" అనేవాట్ట. దాంతో ఎంత వాదించేవాడైనా తోక ముడుచుకు పోయేవాట్ట. దానాదీనా ఆయనకు శాకాహార ధురీణుడని బిరుదిచ్చి వారింటిపేరు నాటినుంచి శాకావారని అనేవారు. అది శాకావారే గని

శాఖావారు కాదని కొందరి వాదం. మఱికొందరి వాదం వారిది చెప్పన్న శాఖల్లోను ఓ శాఖైన ప్రథమశాఖ అనీ, వారొన్నినాడెవరో "అయ్యా! మీ దేశాఖండీ" అంటే "పప్రిథమ శాఖ" అని "థ" "ఖ" రెండక్షరాలు 'శంఖం' 'సిద్ధం' ఒత్తినట్టు ఒత్తేట్ట. అప్పట్నుంచి ఆయనకు శాఖాభిమానం మెండు అని ఆయన కంఠవిషయమై వారి శాఖవారంతా ఓ సభ చేసి "శాఖాభిమాన మహామహిమాధ్యుడు" అనే బిరుదిచ్చి వారింటిపేరు నాటినుండి 'శాఖావారుగా చేసియున్నారని మఱికొందరి వాదం. ఈ వాగ్వివాదాలూ వితర్కాంపులూ విడిచిపెట్టి ఉన్నదున్నట్టుగానూ, జరిగింది జరిగినట్టుగానూ భావిస్తే కనబడేది వేఱు. ఆయన మొలనెప్పుడూ ధగధగలాడిపొయ్యే బత్తాయి చాకు వుండేది. ఆయన్నెవరైనా పలకరించాలీ అంటే ఆ చాకునుబట్టి ఆయన్ను గుర్తించి "చాకాయన" అని పిల్చేవారు. అసలింటిపేరూ పేరూ ఎవరికైనా చెబితేగా మహానుభావుడు—చాకాయన అనేదే ప్రథమ మీద కచటతపలకు గసడదవలు వచ్చిన తరుణాలలోనో లేకపోతే తూర్పు జనం ఏసగా మాట్లాడే సందర్భాల్లోనో సాకాయన అయ్యేది. మఱి ఛాందసులు ప్రీతీదానికి, ఒత్తి షకారము, శకారము, కరారాముడు ఇచ్చే పద్ధతిలో శాఖాయన అయ్యేది పేరు పంతులుగారని సర్వసాధారణంగా గద్వాల సంస్థానపు విద్వాన్ నుండి వీధిబడి పంతులు వఱకు లాతిమనిషి పిలవబడ్డం మన తెలుంగు దేశంలో పరిపాటే.

ఏవం విధంగా నామకరణ మహోత్సవం జరిపి శాఖాపంతులుగారి జీవిత సంగ్రహ ముఖోద్దేశిత చర్యను గురించి చాటించేం. ఓ చదువరులారా! ఆయన జీవితంలో జ్ఞాపకం వుంచుకోవలసినవి రాజకీయంగా గాని, ఆర్థికంగా గాని, అంతరంగికంగా గాని, బహిరంగంగా గాని, ఆధ్యాత్మికంగా గాని, సహింపకగా గాని, ఏమీ కనిపించవు—నిరాడంబర మహర్షుల్లో నిరాడంబర మహర్షిమల్లే. నిర్లిప్తుడు, నిరవశేష విజ్ఞాని, నిర్మలినుడు, నిరహంకారుడు—అందుచేతనే ఇంత నిత్తె సత్తెంగా వెలిసిపోయ్యేడు ఒక్క సంగతే ఆయనకు తెలుసును. ఆ ఒక్క సంగతే ఆయన అందర్కీ చేయమనేవాడు.—

అసాధారణమైన ఆశ్చర్యంతో ఈ అనంత ప్రపంచ నిర్మాణ మండలి యేపదార్థమునూ చూడాలనేవాడు. తననోరు విప్పుకొని కళ్ళుప్పళించుకొని నిర్ఘాంతపోతూ దర్శించేవాడు. ఓ మామిడి చెట్టు చిగురు పట్టిందనుకోండి; లేదా పూత పూసిందనుకోండి; మన యీ నరుడు ఆ తోటడ్డమడి పోతూపోతూ ఆ చెట్టుకేసి అట్టె నిశ్చేష్టుడై చూస్తూ, తనలో తానే, ఎవరు లేకపోయినా ఎవరితోనో అన్నట్టుగా ఆహా! ఎంతబాగా చిగిర్చింది! ఎంతబాగా పూసింది! ఆహా! ఆహా! ఆహా! అని అక్కడో కాస్సేపటి కైరైతేనా కంటబడ్డా "సామీ! ఓయి రామసామీ! చూడు ఆ చిగురు చూడు! ఏం చెట్టోయి! ఆ పూవు చూడు! ఏంపూలోయి! ఎంతందంగా

చిగిర్చింది!" అని అతనుకూడా తనతోపాటు చూచేదాకా పురిగొల్పేవాడు. ఓ కొండ దగ్గర్నుంచి పోయేవాడనుకోండి. ఆ కొండదిగు భాగంనుండి పైశిఖరందాకా ఓసారి తన దృగం చలాల్తో కుంచెట్టి పారినట్టు ప్రామేసేవాడు. ఇటూ అటూ కొండనీడను పరికించి మళ్ళీ కొండకేసి చూసేవాడు. చూచి "ఆహా! కొండ! కొండ! కొండ! ఎంత యెత్తుంది! ఎంత దీర్ఘంగా వుంది! ఎంతనీడ! ఎంతనీడ! ఆహా! ఆహా! ఆహా!" అని తా సృష్టించి అక్కడ దాన్ని, తాఁ బ్రతిష్టించి నట్టుగానే తంద్రైనట్టుగానే గబగబా యెక్కిపోతూ ఎగిరిపోతూ పైని నిలబడి చుట్టూ చూచేవాడు. మళ్ళీ ఆ చూపులో మళ్ళీ కొత్త కొత్త చిత్రవిచిత్ర దృష్టి ప్రవృష్టి! చిట్టచివర కతగాడావింత చర్యవల్ల ఎట్లాగ్గా లోకంలో పరిణమించి పొయ్యేదూ అంటే — లోకమంతా అతగాణ్ణి వింతగా చూస్తూ "ఏంమనిషి! ఏం వింతయితగానిది! ఏం కొత్తపుంత! యితని పంథ! ఓహో!" అనడం ఎక్కడ చూచినా మారుమోగిపోయింది. అతగాడి యశస్సు, అతగాడి ఆశయము, అతగాడి సందేశం, అతగాడి ఆదేశం, అన్నీకూడి గుణించి తీసేసి భాగించి నికరం తేలిస్తే తేలేది ఒక్కమాట. "వింత" అనే ఒక్కమాట! విపరీతంగా వింతపొయ్యేడు.

తుదకావింత ఎంతపనిచేసిందో వినండి! ఒకనాడర్ధ నిశీధినీ సమయంలో — కాళరాత్రి — తాళసాలతమాల హింతాలాది

మహామహీజ జాలంబులనూచుచు, కాక కేక ఘూక బలాక పికశారిక కీరమయూరగృధ్ర గండభేరుండ ప్రముఖ సమస్తాండజంబుల నూచముట్టుగ నేలగూల్చుచు, గర్భనిర్భేదకంబగు గర్జనంబుతో, దర్జనిభంగి ఝుళిపించు క్రొమ్మెరుంగుతో సాంద్ర జలదంబులిళ్లపయిని మళ్లపయిని నేళ్లపయిని సముద్రపుంగెరళ్లపయిని కాలకూట విషంబునుంగురియ, మహాభయంకరంబుగ వీచువిచండ ఝంఝానిలంబెగయ, వైహాయసవీధినుండి మహీస్థలి కంట తమోరాశినా ద్రోసికొని మూసికొని రోషిల్లినది. ఏది! కాళరాత్రిలో కాని కాచీకట్లో తెలియకుండానే పెండాలు పెంకలుసహా, గోడలు గుమ్మాలుసహా ఇళ్ళన్నీ కాళీ యిచ్చి వేసినాయి.

కథలో పంతులుగారు గుడ్లుపైకిదేల్చి నోరావలించి వేసినారు... ... ...

తెల్లాజేసరికంతా నిర్మలంగావుంది. సూర్యోదయం మామూలు సూర్యునిద్వారా కాకుండా మహోగ్రోత్త సూర్యునిగుండా అయినట్టుయింది. పదిమందీ పంతులుగారి చుట్టూమూగినారు. పంతులుగారు పక్కకు తిరగడంలేదు. పలకడంలేదు – ఉన్నదున్నట్టు జరిగిందిజరిగినట్లు చెప్పడమే కాబట్టి చెప్పేస్తున్నా. పంతులుగార్కి పైని నిరూపించిన అనుకూల కాలాగమనంతో పాటు మృత్యుదేవతా సందర్శనం లభించింది. లభించినవెంటనే మహాశ్చర్య నిమగ్న చిత్తైకాగ్ర గణ్యుడౌటచే " ఆహా మృ

త్యువు! ఏమిమృత్యువూ! ఎటువంటి మృత్యువూ! ఓహో మృత్యువూ!!! అని అదే అనుకోవడం అదే అనుకోవడం. ఆ అనుకోవడం అభినయించుకోవడంలోకి మారేసరికి నోరావలింపున్నా కళ్ళు తెరిచివున్నా కలిగే అంతఃకంపే తానదివఱకుగన్న దృశ్యంగాని ఇకగనఁబోవు దృశ్యంగాని మఱెన్నఁడు వింతగున్న దేదీ లేందాబచే తెల్బిరకళ్లు తెల్బినట్లేవుంది. శరీరస్మృతి తప్పి కాళ్లుచల్లబడి నాళ్లిగమై చివరకు గాలి లోగాలి ఏకముగాఁ బరమపదించినారు.

జనుల్లో కొంత తడవుదాకా ఆ నరుడింకా జీవించియుండి దేనినో ఆశ్చర్యంగా చూచుచున్నాడనే యభిప్రాయం. ఆ మీమాంసతో అపరాహ్ణం తిరిగిపోయినా ఊళ్లో వంటల్లేవు. భోజనాల్లేవు కొంతసేపటికో మహాత్ముడు పైనుంచి అవతరించినట్టుగా ఎక్కణ్ణుంచో దిగినవాడై "వెఱ్ఱి ప్రజల్లారా! ఉన్నదున్నట్టుగానూ జరిగిందిజరిగినట్టుగానూ యోజిస్తేయెన్నాళ్లకూ సంశయనివృత్తిగానేరదు. మీరేమో అతని శరీరమింకా దేనినోగూర్చి దేనినోయేల? మృత్యుదేవతను గూర్చియే కానిందు సహజాశ్చర్యచిత్రైకాగ్రగణ్యత దిలకించుచున్నాడని యనుకొనుచున్నారు కామోసుఁ ఆఆశ్చర్యమున్నదంతా ఆత్మదిగాని యీ శరీరముది కాదు. మనము లేనిది లేనట్టుకూడా తెలుసుకోవాలి; యీశరీరం లేనిది ఆత్మమాత్రమే యున్నది. కాబట్టి ఇతడు పొందిన, పొందు

చున్న పౌండబూర్వ్యే దూవవాశ్చర్యమూ ఆత్మపరంగాని శరీర పరమొంతమాత్రంగావు. కాబట్టి యీ శరీరమున కుచితదహన సంస్కారాదులొనర్చి యితని యాత్మకు శాంతిసెప్పి కొనుచు మీరు పప్పూ కూడా భుజింపుడు అని హెచ్చరించేను. అదిగో చితి! అదిగో మృతి! ఓం తత్సత్ !



| రచన | స్ఫురణ | తొలి ప్రకటనము |
|---|---|---|
| 13-12-1932 | లక్ష్మీనరసాపురం | " వినోదిని " లో |